సాక్షి కర్నూలు

శనివారం । 23 । డిసెంబర్ । 2023



## కేసీ కెనాల్‌కు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



## చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి అలయ ప్రదక్షిణ చేశారు.



## ప్రమాదరహితం.. సేవాపథం

టోల్‌ప్లాజా పరిధిలో ప్రయాణికులకు తెలియని ఎన్నో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రయాణం సాఫీగా సాగేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

8లో▸

## న్యూస్‌రీల్

### 16 మందికి 'కారుణ్య' ఉద్యోగాలు

- కౌన్సెలింగ్ నిర్వహించిన డీఆర్వో



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): కారుణ్య నియామకాల కింద 16 మంది జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం డీఆర్వో కె.మధుసూదన్ రావు తన కార్యాలయంలో డిపార్టుమెంట్ ఆప్షన్ ఎంచుకోవడానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. 16మందిలో 13 మంది కర్నూలు పరిధిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయాన్ని, ఒకరు నంద్యాల టీజీపీ ఎస్ఈ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. అగ్రిట్రేడ్ మార్కెటింగ్ విభాగంలో ఒకరు, కర్నూలు ఐసీడీఎస్‌లో పనిచేయడానికి ఒకరు ఆప్షన్ ఇచ్చారు. త్వరలోనే వీరికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు డీఆర్వో తెలిపారు.

### 2.40 లక్షల మందికి ప్రయోజనం

- పెన్షన్ కానుకను పెంచుతూ జీవో ఎంఎస్ నంబరు 96 జారీ
- ప్రతి నెలా అదనంగా రూ.6 కోట్ల లబ్ధి

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంచుతూ రాష్ట్ర ఉత్తర్వులు జారీ చేయడంతో అవ్వతాతలు, అక్కచెల్లెమ్మల్లో నూతనోత్సాహాన్ని ఇస్తోంది. జనవరి 1 నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక మొత్తం రూ.2750 నుంచి రూ.3000కు పెరుగుతోంది. ఈ మేరకు పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీవో ఎంఎస్ నెంబరు.96 జారీ చేశారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 16 రకాల పింఛన్‌లను పంపిణీ చేస్తోంది. ఇందులో వృద్ధాప్య, వితంతు, చేనేతకారులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, చర్మకారులకు డిసెంబరు నెల వరకు రూ.2750 ప్రకారం పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ఈ కేటగిరిలకు చెందిన వారందరికి జనవరి నుంచి రూ.3000 ప్రకారం పెన్షన్ చెల్లిస్తారు. పింఛన్ పెంపుతో జిల్లాలో 2.40 లక్షల మందికిపైగా ప్రయోజన కలుగనుంది. ప్రతి నెలా అదనంగా రూ. 6కోట్లకుపైగా లబ్ధి పొందనున్నారు. అంతేగాక కొత్త పింఛన్లు కూడా మంజూరు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. టీడీపీ పాలన ముగిసే సమయానికి కర్నూలు జిల్లాలో 1.75 లక్షల పింఛన్లు ఉండగా.. నేడు 2.46 లక్షల లబ్ధిదారులు ఉన్నారు. కర్నూలు జిల్లాలోనే పింఛన్ల కింద నెలకు రూ.68 కోట్లకు పైగా నగదు పంపిణీ అవుతోంది. ఏడాదికి పింఛన్ల రూపంలో రూ.820 కోట్ల వరకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. జిల్లాలో జనవరి 1 నుంచి 8 వరకు పెన్షన్ కానుక పెంపు సంబరాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి.



ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) 2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై శుక్రవారం విజయవాడ నోవాటెల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యుటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ వ్యాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

చేనేతపురి ఎమ్మిగనూరులో 'సామాజిక' చైతన్యం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు జనసందోహం భారీగా తరలివచ్చింది. 'జయహో జగన్..వన్స్‌మోర్ జగన్ అంటూ..' యువత నినదించింది. అభిమానులు, పార్టీ శ్రేణుల కేరింతలతో బహిరంగ సదస్సు ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలనపై నేతలు చేసిన ప్రసంగాలకు హర్షధ్వానాలతో సభా ప్రాంగణం హోరెత్తింది.

- ఎమ్మిగనూరులో విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన చేనేత పురి
- పార్టీ జెండాలతో కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- బహిరంగ సభలో ఆకట్టుకున్న ప్రజాప్రతినిధుల ప్రసంగాలు



సామాజిక సాధికార బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

# సామాజిక నీరా'జనం'

### పేదల పక్షపాతి సీఎం జగన్

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారు. అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా బలపర్చేందుకు ఎన్నో పథకాలు తెచ్చారు. వారిలో రాజకీయంగా, సామాజికంగా చైతన్యం తెచ్చేందుకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చారు. స్థానిక సంస్థల్లో పదవులు కట్టబెట్టారు. జనరల్‌కు రిజర్వు అయిన స్థానాల్లో కూడా బీసీలను నిలబెట్టి పదవులివ్వడం వైఎస్ జగన్‌కే సాధ్యమైంది. ఒక్క ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనే పేద ప్రజలకు వివిధ పథకాల ద్వారా రూ.1,176 కోట్లు అందించారు. పరోక్షంగా రూ.300 కోట్ల లబ్ధిని చేకూర్చారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం వ్యయ పరిమితిని రూ.25లక్షలకు పెంచి పేదల పక్షపాతి అయ్యారు.

– చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే



సామాజిక సాధికార బస్సు యాత్రకు పూలు చల్లి స్వాగతం పలుకుతున్న మహిళలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, వేదికపై మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీలు సంజీవ్‌కుమార్, గురుమూర్తి, గోరంట్ల మాధవ్ తదితరులు

ఎమ్మిగనూరు: నూలుపోగుతో.. రంగుల కలయికతో.. చేనేత కార్మికుల అద్భుత పనితనంతో అందమైన వస్త్రాలను తయారు చేసే ఎమ్మిగనూరు పట్టణం.. సామాజిక ప్రభంజనానికి వేదికైంది. వైఎస్సార్‌సీపీ జెండాలతో కళకళలాడింది. శుక్రవారం పట్టణంలో అధికార పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ నేతలకు భారీగా తరలి వచ్చిన ప్రజలు నీరాజనం పలికారు. అభివృద్ధి, సంక్షేమం వైపు తామంతా ఉన్నామని చాటి చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మిగనూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణ నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీలు సంజీవ్‌కుమార్, గురుమూర్తి, గోరంట్ల మాధవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, లింగాయత్, కుర్ని కార్పొరేషన్ చైర్మన్లు వై రుద్రగౌడ్, శారదమ్మ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు..బస్సుయాత్రలో పాల్గొన్నారు. వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకొని అక్కడ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి గాంధీనగర్, శివసర్కిల్, ఎద్దుల మార్కెట్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ చేరుకొని అక్కడ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

### విశేష స్పందన

బస్సులో ర్యాలీగా వచ్చిన వైఎస్సార్‌సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలకు దారిపొడవునా ప్రజలు



నవరత్నాలతో మేలు జరిగిందంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు



బహిరంగ సభలో యువోత్సాహం

బ్రహ్మరథం పట్టారు. నీరాజనాలు పలికారు. తమకు ఎంతో మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చుతూ ఘనస్వాగతం పలికారు. సభావేదికపై నుంచి నేతలు చేసిన ప్రసంగాలకు అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రస్తావించినప్పుడు సభాప్రాంగణం ఈలలు,చప్పట్లతో మారుమోగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగిందని అన్నప్పుడు కరతాళధ్వనులతో సభాప్రాంగణాన్ని హోరెత్తించారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకొద్దాం అన్నప్పుడు తప్పకుండా అంటూ చేతులెత్తి సంఘీభావం తెలిపారు.

### బీసీలంతా అండగా నిలవాలి

వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై. రుద్రగౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. బీసీలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి మంచిని మైనార్టీ నాయకులు రియాజ్ అహ్మద్ వివరించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, శివప్పగౌడ్, ఎంపీపీలు కేశన్న, నసురుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మెన్ నజీర్ అహ్మద్, సునీల్, యూకే రాజు తదితరులు పాల్గొన్నారు.

### అన్ని కులాలకు సమన్యాయం

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అన్ని కులాలకు సమన్యాయం జరిగిందని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన కర్నూలు, హిందూపురం, తిరుపతి ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, గోరంట్ల మాధవ్, గురుమూర్తి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డిలతో కలిసి స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలో కులాల మధ్య అసమానతలను తొలగించి అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. అర్హతే ప్రామాణికం చేసి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. టీడీపీ హయాంలో దళితులపై దాడులు జరిగాయని, బీసీలను అణగదొక్కారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో అన్ని కులాలు మోసపోయాయన్నారు. పవన్‌కళ్యాణ్‌ను కలుపుకొని అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

దించారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో బీసీలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారన్నారు. సామాజిక న్యాయం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, కుర్ని, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ల చైర్మన్లు బుట్టాశారదమ్మ, రుద్రగౌడ్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు యునుస్, కార్యదర్శులు రియాజ్ అహమ్మద్, లక్ష్మీకాంతరెడ్డి, తెర్నెకల్ సురేందర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మద్దయ్య, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి,భీమిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, ఎంపీపీలు కేశన్న, నసురుద్దీన్, విరుపాక్షిరెడ్డి, గుడికల్ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- అన్నదాత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పెట్టుబడి కష్టాలను దూరం చేసిన వైఎస్సార్ రైతుభరోసా పథకం
- రూపాయి చెల్లించకుండానే పంటలకు బీమా సదుపాయం
- అన్ని రకాల సేవలు అందిస్తున్న రైతుభరోసా కేంద్రాలు
- నేడు జాతీయ రైతు దినోత్సవం

# రైతన్నకు వెన్నుదన్ను



పొలంలో విత్తనం వేస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాతల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వివిధ పథకాలు అమలు చేస్తూ రైతుల ఇంట ఆనందాల పంట పండిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందుతోంది. పైసా ప్రీమియం చెల్లించకుండానే పంటలకు బీమా సదుపాయం లభిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో ఉన్న ఊర్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు అందుతున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు సైతం లభిస్తున్నాయి. ప్రతి ఏటా డిసెంబరు 23న జాతీయ రైతు దిత్సవంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో కూడా రైతు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

### అన్నదాతకు భరోసా

జిల్లాలో 2014–15 నుంచి 2018–19 వరకు ప్రతి ఏటా కరువే ఉండేది. అప్పటి పాలకులు రైతుల గురించి పట్టించుకునే వారు కాదు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో అన్నదాతలు చాలా కష్టాలు అనుభవించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే రైతుల కష్టాలకు కూడా ముగింపు పలికినట్లు అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6.31 లక్షల మంది రైతులు ఉన్నారు. మొత్తం 10.36 లక్షల హెక్టార్లలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రైతుల పెట్టుబడి కష్టాలను తీర్చేందుకు 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. 2020, 2021 సంవత్సరాల్లో కోవిడ్–19తో ఆర్థిక వ్యవస్థ సరిగ్గా లేకపోయినా ఎక్కడా లోపం లేకుండా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఐదేళ్లలో వైఎస్సార్ రైతుభరోసా కింద జిల్లాలో అన్నదాతలకు రూ.1,793.53 కోట్ల పెట్టుబడి సాయం అందచేయడం విశేషం.

### ఆర్‌బీకేల్లో అన్ని రకాల సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో రైతుభరోసా కేంద్రాల ఏర్పాటు చేసి అన్నదాతలకు అన్ని రకాల సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. గతంలో రైతుకు ప్రతి అవసరానికి మండల కేంద్రానికి, నియోజకవర్గం కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కర్షకులకు వ్యయప్రయాసలు లేకుండా గ్రామాల వారీగా రైతుభరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామం వదలి బయటికి రావాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల సేవలు వీటిల్లో లభిస్తున్నాయి. ఆర్‌బీకేల ఏర్పాటుతో వ్యవసాయ, ఉద్యాన, ఫిషరీస్, పట్టుపరిశ్రమశాఖ, ఏపీఎంఐపీ తదితర ప్రభుత్వ విభాగాల సేవలన్నీ అందుతున్నాయి. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నిర్దిష్టమైన ధరలకే లభ్యమవుతున్నాయి. పొలంబడి కార్యక్రమాలు, ఈ–క్రాప్ బుకింగ్, అతివృష్టి,అనావృష్టి పరిస్థితులు ఏర్పడినపుడు పంట నష్టం ఎన్యూమరేషన్ తదితర కార్యక్రమాలన్నీ ఆర్‌బీకేల ద్వారానే జరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 877 ఆర్‌బీకేలు ఏర్పాటయ్యాయి. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధరలు లేనప్పుడు రైతు భరోసా కేంద్రాల వారీగా మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అంతేకాకుండా నియోజకవర్గాల వారీగా ఉమ్మడి జిల్లాలో 13 చోట్ల ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ల్లో రైతులు ఉచితంగా ఎరువు లు, విత్తనాల నాణ్యతను పరీక్షించుకునే అవకాశం ఉంది. ఈ ల్యాబ్‌ల్లో పశుసంవర్ధక శాఖకు సంబంధించి పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు.

### ఉచిత పంటల బీమా

రైతులకు ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించడం పెద్ద ఊరటనిస్తోంది. టీడీపీ హయాంలో బీమా మొత్తానికి 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. అయినప్పటికీ పరిహారం తూతూ మంత్రంగా వచ్చేది. ప్రస్తుతం నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా వచ్చినట్లే. 2019–20 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా రైతులకు రూ.618.91 కోట్ల ప్రయోజం లభించింది.

వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా రైతులకు చేకూర్చిన ఆర్థిక లబ్ధి ..

| ప్రభుత్వ పథకం | లబ్ధిపొందిన రైతులు | లబ్ధి పొందిన మొత్తం(రూ.కోట్లలో) |
| --- | --- | --- |
| వైఎస్సార్ రైతుభరోసా | 2,96,739 | 1,793.53 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు | 1,60,257 | 31.46 |
| ప్రకృతి విపత్తులు(ఇన్‌పుట్ సబ్సిడీ) | 18,241 | 17.8 |
| వైఎస్సార్ యంత్రసేవా పథకం(సీహెచ్‌సీ) | 2330 | 17.3 |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 3,25,730 | 618.91 |

### రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సీజన్‌కు ముందే ప్రతి ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ–క్రాప్‌లో పంటలు నమోదైతే చాలు బీమా వర్తించినట్లే. ఐదేళ్లలో అన్నదాతలకు ప్రభుత్వం నుంచి దళారుల ప్రమేయం లేకుండా డీబీటీ ద్వారా రూ.2,479 కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

– పీఎల్. వరలక్ష్మి, డీఏవో

### ఏటా పెట్టుబడి సాయం అందుతోంది



వైఎస్సార్ రైతుభరోసా కింద ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందుతోంది. రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా పంటల బీమా వస్తోంది. ఆర్‌బీకేల వారిగా కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యాంత్రీకరణను రైతులకు అందుబాటులోకి తెచ్చారు.

– రవికుమార్, శభాష్‌పురం, తుగ్గలి మండలం

### అన్ని పథకాలు వస్తున్నాయి



మేం వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు సాగు చేస్తున్నాం. వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమాతో పాటు అన్ని పథకాలు మాకు వర్తిస్తున్నాయి. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలన్నీ ఊర్లోనే అందుతున్నాయి.

– హనుమంతు, అమకతాడు, కృష్ణగిరి మండలం

## క్లుప్తంగా

### ఏపీజీఎల్ఐ ఏడీగా గౌరి ప్రసన్న

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) కర్నూలు జాయింట్ డైరెక్టర్ కార్యాలయం అసిస్టెంటు డైరెక్టర్‌గా ఎస్.గౌరి ప్రసన్నను నియమిస్తూ ఏపీజీఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని ఏపీజీఎల్ఐ డైరెక్టరేట్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న గౌరిప్రసన్నకు అసిస్టెంటు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఇంతవరకు ఇక్కడ ఏడీగా పనిచేసిన వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఏడీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఈ నియామకం జరిగింది. రెండు, మూడు రోజుల్లో ఈమె బాధ్యతలు స్వీకరిస్తారు.

### డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 67 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో ఐదో సెమిస్టర్ పరీక్షకు 10,937 మందికి గాను 10,053 మంది, మధ్యాహ్నం సెషన్‌లో మొదటి సెమిస్టర్ పరీక్షకు 11,272 మందికి గాను 10,324 మంది హాజరయ్యారు. చూచిరాతలకు పాల్పడిన ఎమ్మిగనూరు సిద్దార్థ డిగ్రీ కళాశాల, హనుమాపురం నలంద డిగ్రీ కళాశాల, కర్నూలు సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ముగ్గురు విద్యార్థులు డిబార్ చేశామని డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు.

### పాముకాటుతో చిన్నారి మృతి


రుత్విక (ఫైల్)

కృష్ణగిరి: పాము కాటు గురై చిన్నారి మృతి చెందిన ఘటన పెద్దొడ్డి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవికుమార్‌కు ఆలంకొండ గ్రామానికి చెందిన గీతాంజలికి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కూమార్తె రుత్విక ఉంది. ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలంలో రాత్రి ఆరున్నర గంటల సమయంలో చిన్నారి ఆడుకుంటూ గోడ దగ్గరకు వెళ్లి ఏడవడంతో తల్లి వెళ్లి చూడగా చిన్నారికి కాలికి రక్తం చుక్కలు రావడాన్ని గమనించి భర్తకు తెలిపింది. వెంటనే ఆతను టార్చిలైట్ వేయగా రెండు పాములు కనిపించాయి. ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వగా రెండు నాగు పాములను చంపారు. వెంటనే చిన్నారిని 108లో కర్నూలుకు తరలిస్తుండగా వెల్దుర్తి దగ్గరకు వచ్చేసరికి చిన్నారి మృతి చెందింది.

# ప్రమాదరహితం.. సేవాపథం


నన్నూరు టోల్‌ప్లాజా సముదాయం

టోల్‌గేట్ కనిపించగానే భారంగా భావిస్తాం. ఏంటిది, ఈ డబ్బు వసూళ్లు ఎందుకు? అనే అనుమానం కలుగుతుంది. అప్పటి వరకు వెడల్పాటి రహదారులపై సాఫీగా సాగిన ప్రయాణాన్ని మరిచి విమర్శలు గుప్పించడం పరిపాటి. ఏం చేశారని ఇంత డబ్బు గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యక్తులు కోకొల్లలు. అయితే రహదారిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగానే ఈ వసూళ్లు అనే విషయం చాలా మందికి తెలియని అంశం. అంతేకాదు.. టోల్‌ప్లాజా పరిధిలో ప్రయాణికులకు తెలియని ఎన్నో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. మనకు తెలియకుండానే ఈ ప్రాంతం వాహన చోదకులకు తోడుగా నిలుస్తోంది. టోల్‌ప్లాజా పరిధిలో కిలోమీటర్ల మేర ప్రయాణం సాఫీగా సాగేందుకు ఎంతో దోహదపడుతోంది. ఎప్పుడు ఎలాంటి ఆపద కలిగినా మేమున్నామంటూ ముందుకొస్తోంది. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు.. ఎన్నో రకాల సేవలను అందిస్తోంది. – సాక్షి, కర్నూలు డెస్క్


పెట్రోలింగ్ వాహనం

### రూట్ పెట్రోలింగ్ వెహికల్ సర్వీసెస్

» వెహికల్ బ్రేక్ డౌన్స్

( ఏ సమయంలోనైనా సమాచారం అందుకున్న వెంటనే పెట్రోలింగ్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుంటుంది. ముందుగా వాహన భద్రత దృష్ట్యా రెడ్ సేఫ్టీకోన్స్ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత సమస్యను తెలుసుకుంటారు. డీజిల్/పెట్రోల్ అయిపోయిందా? టైర్ పంక్చర్ అయిందా? లేక ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా తెలుసుకొని ఆ మేరకు చర్యలు తీసుకుంటారు. డీజిల్/పెట్రోల్ అయిపోయినట్లయితే.. వాహన చోదకులతో అందుకు సంబంధించిన నగదును మాత్రమే తీసుకొని సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్లి తీసుకొచ్చి వాహనం స్టార్ట్ అయ్యేంత వరకు బాధ్యతను తీసుకుంటారు. టైర్ పంక్చర్ అయినా పెట్రోలింగ్ వాహన సిబ్బంది మార్పు చేస్తారు.) పెట్రోలింగ్ వాహనంలో ఒక రూట్ ఆఫీసర్, హెల్పర్, డ్రైవర్ నిరంతరం అందుబాటులో ఉంటారు.

» యాక్సిండెంట్స్ రిమూవల్

సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకొని తీవ్రతను పరిశీలిస్తారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటారు. యాక్సిడెంట్ వాహనాలతో ఇతర ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వాటిని పక్కకు తొలగిస్తారు. ప్రమాదంలో ఎవరికైనా గాయాలైనట్లు గుర్తిస్తే.. వెంటనే ఫస్ట్ ఎయిడ్ చేస్తారు. అంతేకాదు.. ప్రతి టోల్‌ప్లాజాలో ఒక ఫస్ట్ ఎయిడ్ రూం ఉంటుంది. ఇక్కడ పారామెడిక్ (బీఎస్సీ నర్సింగ్), హెల్పర్, డ్రైవర్ అందుబాటులో ఉంటారు. వీరి సేవలను 24x7 ఉపయోగించుకునే వీలుంది.

» సురక్షిత ప్రాంతాలకు తరలించడం

మానసిక రోగులు రాత్రిళ్లు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంటారు. ఇలాంటి వారిని గుర్తించి సమీపంలోని దేవాలయాలు, లేదా జనసంచారం ఉన్న ప్రాంతాల్లో వదులుతారు. అదేవిధంగా అతిగా మద్యం సేవించి పడిపోయిన వాళ్లను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. రహదారిలో చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగిస్తారు.

» అనుమతిలేని చోట పార్కింగ్

అధిక శాతం ప్రమాదాలు రాత్రి వేళల్లోనే చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోలింగ్ వాహన సిబ్బంది తెల్లవారుజామున 2 నుంచి 5 గంటల మధ్య అనుమతిలేని చోట పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వాహన డ్రైవర్ అందుబాటులో లేకపోతే పక్కకు తొలగిస్తారు. ఆయా డ్రైవర్లకు ఫేస్ వాష్ చేయించడంతో పాటు సమీపంలోని పార్కింగ్ స్థలాన్ని తెలియజేసి అక్కడ సేదతీరేందుకు సూచిస్తారు.

| నేషనల్ హైవే 40 పరిధి | రహదారిలోని టోల్ గేట్లు |
|---|---|
| కర్నూలు నుంచి కడప వరకు 188 కిలోమీటర్లు | నన్నూరు, చాపిరేవుల, చాగలమర్రి, పాటిమీదపల్లి |

**అత్యవసర వేళల్లో సంప్రదించాల్సిన నంబర్లు**

| | |
|---|---|
| రూట్ పెట్రోలింగ్ వాహనం: 7997710182 | టో క్రేన్ హైడ్రా(20 టన్స్): 9618030009 |
| అంబులెన్స్: 7997710181 | కంట్రోల్ రూం: 7036500054 |

నేషనల్ హైవే హెల్ప్‌లైన్: 1033

### అంబులెన్స్


ప్రయాణికుల సేవకు సిద్ధంగా అంబులెన్స్

ప్రతి టోల్‌ప్లాజాలో అడ్వాన్స్‌డ్ బేసిక్ లైఫ్ సపోర్టు అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగిన సమాచారం తెలిసిన వెంటనే ఈ వాహనం ఘటనా స్థలికి చేరుకుంటుంది. తీవ్రతను పరిశీలించి సేవలు అందిస్తారు. బాధిత కోరిక మేరకు ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులకు ఎలాంటి నగదు తీసుకోకుండానే తరలిస్తారు. ప్రథమ చికిత్స అందించడంతో పాటు గాయాలకు కట్లు కట్టడం చేస్తారు.

### టోల్‌ప్లాజాలో విస్తృత సేవలు

టోల్ ప్లాజా అనగానే డబ్బు మాత్రమే వసూలు చేస్తారనుకోవడం పొరపాటు. అందుకు తగిన సేవలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా తాగునీరు ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా అత్యవసరమైతే వాష్‌రూమ్స్‌ను వినియోగించుకోవచ్చు. చిన్న చిన్న గాయాలకు కూడా ఇక్కడ చికిత్స చేయించుకునే వీలుంది.

➢ ప్రతి రోజూ అర్ధరాత్రి సమయంలో వాహన డ్రైవర్లకు ఫేస్ వాష్ చేయించడంతో పాటు టీ అందిస్తారు. సుమారు 50 మంది వరకు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు.

### ఇది నిరంతర ప్రక్రియ

➢ జాతీయ రహదారికి సమీపంలోని గ్రామీణ ప్రాంత వాహన చోదకులకు ప్రతి రోజూ రేడియం స్టిక్కర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తారు. స్టిక్కర్స్ లేని వాహనాలను గుర్తించి ఎలాంటి డబ్బు తీసుకోకుండానే వీటిని అమరుస్తారు.

➢ రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్ వాహనాలను గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తారు.

➢ సీట్ బెల్ట్ పెట్టుకోకపోయినా, హెల్మెట ధరించకపోయినా గుర్తిస్తారు.

➢ ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేస్తారు.

### నెలవారీ కార్యక్రమాలు ఇలా..

➡ టోల్‌ప్లాజా పరిధిలోని ప్రధాన రహదారికి సమీపంలో పాఠశాలలు ఉన్నట్లయితే పిల్లలను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రోడ్డు దాటిస్తారు. ఈ విషయంలో పిల్లలకు అవగాహన కల్పిస్తారు.

➡ రహదారి ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అధిక శాతం ప్రయాణికులు భయంతో గుండెపోటుకు గురవుతారు. ఈ నేపథ్యంలో సీపీఆర్ ఎంతో కీలకం. అందువల్ల నెలకోసారి ప్రధాన జంక్షన్లలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రమాదాల తీవ్రత ఇలా.. (2023-24)**

| చిన్న ప్రమాదాలు | పెద్ద ప్రమాదాలు | భారీ ప్రమాదాలు |
|---|---|---|
| 182 | 80 | 24 |

గమనిక: 30.11.23 నాటి వరకు గణాంకాల ఆధారంగా..

**తెల్లవారుజాము నుంచి ఏ సమయంలో ఎన్ని ప్రమాదాలు (2023-24)**

| గంటలు | 00-3 | 3-6 | 6-9 | 9-12 | 12-3 | 3-6 | 6-9 | 9-12 |
|---|---|---|---|---|---|---|---|---|
| ప్రమాదాలు | 53 | 54 | 46 | 66 | 71 | 75 | 61 | 41 |

( గమనిక: 30.11.23 నాటి వరకు గణాంకాల ఆధారంగా..)


టోల్‌ప్లాజాలోని మరుగుదొడ్లు


ఫస్ట్ ఎయిడ్ రూం

**1.12.23**

తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో కడప వైపునకు అత్యంత వేగంగా వెళ్తున్న స్కూటీ వాహనం అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. 3.27 గంటలకు సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా అంబులెన్స్ వాహనం 3.34 గంటల సమయంలో ఘటనా స్థలికి చేరుకుంది. స్వల్ప గాయాలైన వారికి అక్కడికక్కడే వైద్య సేవలు అందించారు. ఆ తర్వాత ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకొని ప్రమాద సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు.

### సేవలను సద్వినియోగం చేసుకోండి



టోల్‌ప్లాజా తరపున విస్తృతమైన సేవలు అందిస్తున్నాం. మా సిబ్బంది 24 గంటలకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటారు. జాతీయ రహదారిలో ఎప్పుడు, ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా మా టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు. ప్రయాణికుల భద్రతకు అంత్యత ప్రాధాన్యత కల్పిస్తున్నాం. – మదన్‌మోహన్, ఆర్‌ఈపీఎల్ ప్రాజెక్టు హెడ్

### ‘ఖాకీ’ స్వప్నం సాకారం


మహేష్

కల్లూరు: ఖాకీ దుస్తులు ధరించాలనే స్వప్నాన్ని ఉలిందకొండ గ్రామానికి చెందిన గొల్ల మహేష్ నెరవేర్చుకున్నాడు. తల్లిదండ్రులు జి. చిన్న మద్దయ్య, లక్ష్మీదేవి వ్యవసాయ పనులు చేస్తూ కుమారుడిని బీటెక్ వరకు చదివించారు. మొదట 2016లో కానిస్టేబుల్ పరీక్ష, 2018లో ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలు రాసి ఉద్యోగం సాధంచలేకపోయాడు. అనుకున్న లక్ష్యం సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాడు. పట్టుదలతో చదివి 2023లో నిర్వహించిన ఎస్ఐ పరీక్షలో విజయం సాధించాడు. అన్న చిన్నయ్య, తమ్ముడు రాజు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగం చేస్తున్నారని, వారితో పాటు తల్లిదండ్రుల సహకారంతో తన కలను నెరవేర్చుకున్నట్లు మహేష్ తెలిపారు.

### మాధవరం యువకుడి ప్రతిభ


మద్దెల సతీష్

వెలుగోడు: వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు ఎస్ఐగా ఎంపికై ప్రతిభ కనబరిచాడు. మాధవరం గ్రామానికి చెందిన రైతు బిడ్డ మద్దెల సతీష్ ఎస్ఐగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మద్దెల సంజీవకుమార్ వ్యవసాయం చేస్తూ తన కుమారుడిని ఇంజనీరింగ్ చదివించాడు. ఎస్ఐగా కొలువు సాధించాలనే లక్ష్యంతో సతీష్ కష్టపడి చదివి సాధించాడు. సతీష్‌ను స్థానికులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

# పట్టుదలతో శ్రమించి.. గెలిచారు!

ఎస్ఐ ఫలితాల్లో విజయం సాధించి వారంతా కలను నెరవేర్చుకున్నారు. తల్లిదండ్రుల రెక్కల కష్టం మీద చదువుకున్న వారు కొందరైతే.. వివిధ పనులు చేస్తూ విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు మరికొందరు.. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకోసం వేల మందితో పోటీ పడి విజేతలుగా నిలిచారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధించవచ్చని నిరూపించారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

### అంగన్‌వాడీ ఆయా కుమారుడు ఎస్ఐ


జి. సురేష్

ఆస్పరి: మండల పరిధిలోని కలపరి గ్రామానికి చెందిన జి. శివమ్మ, వీరభద్రి దంపతుల కుమారుడు జి. సురేష్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైయ్యాడు. తల్లి శివమ్మ కలపరిలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్నారు. సురేష్.. డిగ్రీ, పీజీ కర్నూలులో పూర్తి చేసి ఈ ఏడాది తెలంగాణ కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యాడు. ఎస్ఐ కావాలనే లక్ష్యంతో ఆపోస్టుకు వెళ్లలేకపోయాడు. ఇదే ఏడాదే తండ్రి వీరభద్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎలాంటి కోచింగ్ లేకుండా కర్నూలులో రూమ్‌లో ఉంటూ చదువుకొని మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐగా ఎంపికయ్యాడు. తమ్ముడు ఈరన్న బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తమకు ఎలాంటి పొలాలు లేవని, తల్లి శివమ్మ అంగన్‌వాడీ అయాగా పని చేస్తూ చదివించారని సురేష్ తెలిపారు. అమ్మ కష్టంతో చదివి ఎస్ఐగా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

### రైతు బిడ్డ ప్రతిభ


వీర ప్రతాప్

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన వీర ప్రతాప్ ఎస్ఐ రాత పరీక్షలో ప్రతిభ చూపాడు. ఏపీఎస్పీ విభాగంలో 31వ ర్యాంకు సాధించి ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రైతు కుటుంబానికి చెందిన ఓబులేసు, వెంకట లక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడైన మైదుకూరు వీర ప్రతాప్ ఎంటెక్ పూర్తి చేశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగాన్ని వదిలేసి.. ఇంటి వద్ద ఉండి ఎస్ఐ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ, పోటీ పరీక్షలకు హాజరై ఏపీఎస్పీ ఎస్ఐగా మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగాన్ని సాధించాడు. వీర ప్రతాప్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### ఒడిదుడుకులు అధిగమించి..


నబిల్లా కరిష్మా

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నబిల్లా కరిష్మా అనే యువతి కష్టపడి చదివి ఎస్ఐ కొలువు సాధించారు. ఎస్ఎంటీ కాలనీకి చెందిన ఎస్.రఫీక్, ఎస్ జరినా దంపతుల నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె నబిల్లా కరిష్మా నవోదయలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. తరువాత పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితితో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఒడిదుడుకులను అధిగమించి ఎస్ఐగా ఎంపికయ్యారు. ఈ యువతిని బంధువులు, కాలనీవాసులు అభినందించారు.

### విజయ ‘కీర్తన’


నాగకీర్తన

వెలుగోడు: మిడుతూరు స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగకీర్తన ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు. వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన మేడమ్ వెంకటేశ్వర్లు, సరోజా దంపతులకు ఒక కూతురు, కుమారుడు సంతానం. డిగ్రీ వరకు చదువుకున్న వెంకటేశ్వర్లు తాను ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని మధన పడేవాడు. ఈ క్రమంలో పిల్లలను బాగా చదివించాడు. కూతురు నాగ కీర్తన 2019లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. అంతటితో ఆగకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు.

### నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

మహానంది: నంద్యాల – గిద్దలూరు రహదారిలో శుక్రవారం నల్లమల ఘాట్ రోడ్‌లో వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్, ఐషర్ లారీ ఢీకొన్నాయి. దీంతో దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ నెలకొంది. వరిగడ్డి ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ సమయంలో జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు వాహనాలు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.





### వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

● జేసీ నారపురెడ్డి మౌర్య


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్రమార్జన కోసం కొందరు వ్యాపారులు కల్తీలు, నకిలీలతో వినియోగదారులను మోసం చేస్తున్నారన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ బిల్లు తీసుకొని వినియోగదారు వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ... కేసు వేసిన 90 రోజుల్లో పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ సంవత్సరం 22 కేసులను నమోదు చేయగా 60 రోజులకే 18 కేసులు పరిష్కరించామన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ కమిటీ కార్యదర్శి శివమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆహారానికి సంబంధించిన వస్తువుల కొనుగోలు సమయంలో ఎఫ్ఎస్ఎస్ఐ లోగో ఉందో లేదో చూసుకోవాలన్నారు. డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాదు మాట్లాడుతూ..జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 24వతేదీ వరకు కాలేజీలు, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభను చూపిన 39 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సభ్యుడు, సహాయ పౌరసరఫరాల అధికారి ఆచార్యులు పాల్గొన్నారు.

### ఆడుదాం ఆంధ్రపై అవగాహనకు యోగా, మారథాన్

కర్నూలు(అర్బన్): ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నియోజకవర్గాల వారీగా ఈ నెల 24వ తేదీలోగా యోగా, మారథాన్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె వివిధ అంశాలపై డివిజనల్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ఇంకా పలు ప్రాంతాల్లో మైదానాలను గుర్తించాల్సి ఉందని, టీములు ఏర్పాటు చేయడంలో కూడా ఆశించిన పురోగతి లేదన్నారు. రీ సర్వేకు సంబంధించి 160 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు పూర్తి అయినప్పటికి కొందరు తహసీల్దార్ల లాగిన్లలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అసైన్‌మెంట్ భూములు ఇచ్చిన వాటికి ఈకేవైసీ, ఫ్రీ హోల్డ్ అసైన్మెంట్‌కి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూధనరావు, రీ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.